


ఉపాధ్యాయుల పదోన్నతుల గందరగోళం

- కౌన్సిలింగ్‌ను అడ్డుకున్న ఎస్‌జిటిలు - కౌన్సిలింగ్‌ను నిలిపివేసిన విద్యాశాఖ అధికారులు - పదోన్నతుల్లో ఒకే విధానం పాటించాలి : యుటిఎఫ్



డిఇఒ కార్యాలయం వద్ద ఉన్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పాఠశాల ఎస్‌జిటి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న పదోన్నతుల కౌన్సిలింగ్ గందరగోళంగా మారింది. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిలింగ్‌ను ఎస్‌జిటిలు అడ్డుకున్నారు. గతంలో ఉపాధ్యాయుల పదోన్నతుల నిర్వహణలో అనేకమందికి పదోన్నతి నిరాకరిస్తూ నాటు విల్లింగ్ ఇచ్చారు. నాట్ విల్లింగ్ తర్వాత ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు జాబితాలను సిద్ధం చేశారు. ఇప్పుడు నాట్ విల్లింగ్ ఇచ్చినటువంటి ఉపాధ్యాయులు కూడా తమకు పదోన్నతులు కావాలని విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. వీరి తర్వాత పదోన్నతులు పొందేందుకు సిద్ధంగా ఉన్న ఉపాధ్యాయులు కూడా రావడంతో కౌన్సిలింగ్ గందరగోళంగా మారింది. ఇరు వర్గాల ఉపాధ్యాయులు ఒకేసారి కౌన్సిలింగ్ వద్దకు చేరుకోవడం గందరగోళ వాతావరణానికి దారితీసింది. విద్యాశాఖ అధికారులు ఎవరికీ సమాధానం చెప్పుకోలేక తాత్కాలికంగా పదోన్నతుల ప్రక్రియను వాయిదా వేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్, కర్నూల్ డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు కౌన్సిలింగ్‌ను వాయిదా వేస్తూ తాత్కాలికంగా నిలిపివేశారు. గణితం, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల ప్రక్రియను నిలిపివేశారు.

పదోన్నతులను ఒకే విధానంలో చేపట్టాలి : యుటిఎఫ్

జిల్లాలో చేపడుతున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ఒకే విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జె.ఎల్లప్ప, ఎస్ఎం.జయరాజు, జిల్లా కార్యదర్శి నవీన్ పాటీ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి యుటిఎఫ్ నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎల్లప్ప, జయరాజులు మాట్లాడుతూ ఈ కౌన్సిలింగ్‌లో రోస్టర్ పాయింట్ పాటించకుండా జనరల్ నెంబర్‌తో కౌన్సిలింగ్ నిర్వహించారన్నారు. కనీసం ఫైనల్ లిస్టు అందుబాటులో ఉంచకుండా కౌన్సిలింగ్ నిర్వహించే ప్యానల్ అధికారుల దగ్గర మాత్రమే లిస్టు ఉంచుకొని పేర్లు పిలుస్తూ కౌన్సిలింగ్ చేపడుతున్నారన్నారు. మేలో జరిగిన పదోన్నతుల కౌన్సెలింగ్. లో ఎస్ఎ ఇంగ్లీషుకు నాట్ విల్లింగ్ ఇచ్చిన 10మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతులు ఇచ్చారన్నారు. స్కూల్ అసిస్టెంట్ బయాలజీ , స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ కౌన్సెలింగ్ రద్దు చేసి అన్ని సబ్జెక్టులకు ఒకే విధానం కొనసాగించాలన్నారు. రోస్టర్ పాయింట్‌తో కూడిన ఫైనలిస్ట్ అందరికీ అందుబాటులో ఉంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయి

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఈ నెల 26 నుండి 31 వరకు నిర్వహిస్తున్న సిపిఎం మహా పాదయాత్రలో కార్మిక వర్గం అగ్ర భాగాన ఉండి నడిపించాలని సిఐటియు పిలుపు ఇచ్చింది. శుక్రవారం సిఐటియు న్యూ సిటీ కమిటీ సమావేశం కార్మిక కర్షక భవనంలో ఆర్.నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి.నిర్మల, పిఎస్.రాధాకృష్ణ, న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, సిఐటియు న్యూ సిటీ నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా లు సమావేశానికి హాజరయ్యారు. కార్మికులను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ సిపిఎం కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం మహా పాదయాత్రను చేపడుతుందన్నారు. ఈనెల 26 నుండి ప్రారంభమయ్యే మహాపాదయాత్ర గ్రామాలలో, పట్టణాలలో ప్రజలను కలుసుకొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలన్నారు. వెనకబడిన కర్నూలు జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం తక్షణమే చేపట్టి సాగు, తాగునీరు అందించాలని, ప్రతి మండలానికి ఒక డిగ్రీ కాలేజీ, ఇంటర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామంలో ప్రాథమిక , హైస్కూలు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించి, రోజు కూలి రూ 600 ఇవ్వాలన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాల కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. కర్నూలు జిల్లాకు తలమానికంగా ఉన్న ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో లెక్చరర్స్‌నుస్టాఫ్‌ను భర్తీచేసి యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలనన్నారు. నిద్రమత్తులో ఉన్న ఈ ప్రభుత్వానికి ముళ్ళ కర్రతో నిద్రలేపాల్సిన అవసరం ఉందన్నారు. మహా పాదయాత్రలో కార్మిక, కర్షక, అన్ని రకాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈనెల 31న కలెక్టరేట్ ముందు మహాధర్నాలో వేలాదిగా ప్రజలు తరలిరావాలని కోరారు. సిఐటియు నగరనాయకులు కె.సుధాకరప్ప, జి.గోపాల్, వెంకటేశ్వర్లు, కె.ప్రభాకర్, ఎర్రమల, గోవిందు, బాష పాల్గొన్నారు.

'యుసిసి'పై ఆవాజ్ సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

యూనిఫాం కామన్ సివిల్ కోడ్‌ను వ్యతిరేకిస్తూ ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షులు ఎక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించారు. భారతదేశంలో సమసమాజం రాలేదని ,లింగ వివక్ష జాతి వివక్ష ,ఆర్థిక సామాజిక తదితర తారతమ్య భేదాలు, ఉన్నాయని ఈ యూనిఫామ్ కామన్ సివిల్ కోడ్ ఇప్పుడున్న పరిస్థితులలో భారత దేశానికి అవసరం లేదని ఆవాజ్ నగర కమిటీ కార్యదర్శి మొహమ్మద్ షరీఫ్ వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో యూనిఫాం సివిల్ కోడ్ అవసరం లేదన్నారు. కర్నూలు నగరంలోని ప్రజలందరూ దీన్ని తిరస్కరిస్తూ అర్జీలను ఇచ్చారని వివరించారు. భారతదేశంలో కేవలం రాజకీయ లబ్ధి కోసం బిజెపి ఆడుతున్న నాటకం తప్ప మరొకటి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నుండి ఇప్పటివరకు కుల మత ప్రాంతీయ తగాదాలు వైశాల్యాలు పెంచి ప్రజల మధ్య అనైక్యతను తెచ్చి హిందూ ముస్లిం, హిందూ క్రిస్టియన్ లా మధ్య తగాదా పెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తుందని అన్నారు. 2024లో ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజల మధ్య ఏదో ఒక చిచ్చు లేపి ప్రజలను గంధర గోళం సృష్టించి ఓట్లు దండుకోవాలని చూస్తున్నందున ఇటువంటి దృష్ట చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని వివరించారు. మూడు ప్రాంతాలలో సంతకాల సేకరణ ఆవాజ్ కమిటీగా నిర్వహించారని, ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని చెప్పారు. అనంతరం షేక్ అబ్దుల్ నయీమ్ షేక్ అబ్దుల్ నాసిర్ లు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఏదైతే అవసరమో అది చేయడం లేదన్నారు. మొదటి సంతకాల సేకరణ జామియా మసీదు మర్కాజ్ ఎదురుగా నిర్వహించిన మహబూబ్ బాషా, ఇంతియాజ్ ,గని ఖాన్, యూసుఫ్ పాల్గొన్నారు. రెండోది జమ్మి చెట్టు దగ్గర అబ్దుల్ రెహమాన్, గౌస్ బాషా, ఖాజాబాషా, ఇమామ్ పాల్గొన్నారు.మూడో సంతకాల సేకరణ లో మాసూమ్‌బాష దర్గా ఎదురుగా ఆవాజ్ కమిటీ గౌరవ అధ్యక్షులు ఇస్మాయిల్, నూర్ అహ్మద్, మూసమియా, ఫయాజ్ పాల్గొన్నారు.


సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

జగన్నాథగట్టు అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- కలెక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


జగన్నాథ గట్టుపై లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

జగన్నాథగట్టు ప్రాంతానికి నీటి వసతి, ఇతర మౌలిక వసతులతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగన్నాథగట్టు హౌసింగ్ లే అవుట్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్నాథ గట్టు ప్రాంతానికి నీటి సదుపాయం, మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించారు. జగన్నాథ గట్టుపై ఇప్పటికే ట్రిబుల్ ఐటిడిఎం, క్లస్టర్ యూనివర్సిటీ, లా కాలేజీ, హౌసింగ్ లే అవుట్ ఉన్నాయన్నారు. వీటితో పాటు భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉన్నందున, ఇక్కడ నీటి వసతి కోసం శాశ్వతమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. భవిష్యత్ అవసరాల కోసం రానున్న 50 సంవత్సరాల వరకు ఈ ప్రాంతంలో ఎలాంటి నీటి ఎద్దడికి తావు లేకుండా మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌ను చైర్మన్ గా కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో కుడా వైస్ చైర్మన్, ఇరిగేషన్ ఎస్ఇ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ, డిపిఒ, హౌసింగ్ పిడి, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ, ఎపిఎంఐపి పిడి, కర్నూలు ఆర్‌డిఒ సభ్యులుగా ఉంటారని కలెక్టర్ ఈ ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ అంశంపై సవివరమైన నివేదికను వారం లోపు తనకు సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణాలకు సరైన రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు కూడా మాస్టర్ ప్లాన్ రూపొందించి ఈ అంశంపై కూడా వారంలోపు సవివరమైన నివేదికను తనకు సమర్పించాలని కుడా వైస్ చైర్మన్, ఆర్ అండ్ బి ఎస్ఇ లను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ టివి9 కాలనీని పరిశీలించారు. కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్, కుడా వైస్ ఛైర్మన్ సూర్య ప్రతాప్ నారాయణ రెడ్డి, హౌసింగ్ పిడి వెంకట నారాయణ, ఇరిగేషన్ ఎస్ఇ రెడ్డి శేఖర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ ఉమాపతి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ నాగేశ్వర రావు, డిపిఒ నాగరాజు నాయుడు, హౌసింగ్ ఇఇ నాగరాజు, కర్నూలు తహశీల్దార్ శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారులపై ప్రమాదాలు తగ్గాలి

- నంద్యాల చెక్‌పోస్టు నుండి సఫా కాలేజీ వరకు డివైడర్లు
- కర్నూలులో బస్సు షెల్టర్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు
- రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సృజన

జాతీయ రహదారులైన ఎన్ హెచ్ 40 , 44 రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు హైమాస్ లైట్స్ త్వరితగతిన ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారుల్లో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించిన ఆ ప్రాంతాలలో సోలార్ లైట్స్, సోలార్ బ్లింకర్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. హై మాస్‌లైట్లు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని రహదారి అధికారులను ప్రశ్నించగా హైమాస్ లైటింగ్ ఏర్పాటుకు అయ్యే ఎస్టిమేషన్ వివరాలను రీజినల్ ఆఫీస్‌కు పంపినట్లు జిల్లా కలెక్టరుకు సంబంధిత అధికారులను నివేదించారు. ఓర్వకల్ అండర్‌పాస్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఎంతవరకు వచ్చాయని ఎన్‌హెచ్-40 పిడిని కలెక్టర్ ప్రశ్నించారు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనల గురించి చీఫ్ జనరల్ మేనేజర్, రీజినల్ ఆఫీసర్ విజయవాడ వారితో చర్చించామని పిడి కలెక్టరుకు వివరణ ఇచ్చారు. కడప నుండి కర్నూలు జాతీయ రహదారిలో పెండింగ్ పనులను చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు.నంద్యాల చెక్పోస్ట్ నుండి సఫా ఇంజినీరింగ్ కాలేజ్ వరకు ఏర్పాటు చేయాల్సిన డివైడర్ పనులు ఎంతవరకు వచ్చాయని కలెక్టర్ ఆర్అండ్ బి ఇంజనీరింగ్ అధికారిని ప్రశ్నించారు. రోడ్ విస్తరణ పనులు పూర్తి చేయగానే, డివైడర్ పనులు మొదలు పెడతామని కలెక్టర్ సమాధానం ఇచ్చారు. రోడ్ విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కర్నూలులో బస్ షెల్టర్ల ఏర్పాటుతోపాటు సిసి కెమెరాలు కూడా త్వరత్వరగా బిగించాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. కర్నూలు నుండి నందికొట్కూరు మార్గంలో ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర అండర్ పాస్ నిర్మాణ ప్రతిపాదనలు త్వరగా తిరిగి తయారుచేసి పంపాలని అధికారి జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. నన్నూరు లోని జగనన్న కాలనీ అప్రోచ్ రోడ్డుకు సంబంధించిన ప్రాంతాన్ని సందర్శించి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమీషనర్ శ్రీధర్, ఆర్టీసి అధికారులు, నేషనల్ హైవే కర్నూలు, అనంతపురం జిల్లాలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా ఉంటాం : కాటసాని

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా నైపుణ్య అభివద్ధి సంస్థ , ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో శ్రీ సాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగుల జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు ప్రైవేటు సంస్థల్లో కూడా ఉద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇలాంటి జాబ్ మేళాలో నిరుద్యోగులు పాల్గొని ఉపాధి అవకాశాలు పొందాలని కోరారు. దాదాపుగా 945 మంది నిరుద్యోగులు పాల్గొనగా 252 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సిఇఒ రమణ, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి దీప్తి , శ్రీ సాయి కృష్ణ డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు పి.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి సీడ్‌ఆప్ జిల్లా మేనేజర్ కిరణ్, ప్లేస్మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయి తేజ, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులోపు ప్రభుత్వ భవనాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-సి బెళగల్



మండలంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ప్రభుత్వ భవన నిర్మాణం పనులను ఆగస్టులోగా పూర్తి చేయాలని ఇఇ మహేశ్వర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పరిషత్ కార్యాలయంలో డిఇ మద్దన్న, ఎఇ గంగరాజు, ఎంపిడిఒ రాముడు సమక్షంలో నిర్మాణంలో నున్న భవనాలను తనిఖీ చేసి కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఇక్కడే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య భవనాలు, డిజిటల్ లైబ్రరీలు వంటివి సకాలంలో బిల్లులు అందడం లేదన్న కారణాలతో నిర్మాణాలు ఆగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు తప్పుకోవాల్సి వస్తే విరమించుకోవచ్చని అన్నారు. సత్వరమే పనుల పూర్తి దశపై శ్రద్ధ చూపితే 15 రోజులకోసారి బిల్లులు తప్పకుండా వేస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా సచివాలయం ఇంజినీర్లు పని తీరులో మెరుగుదల చూపించాలని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని నదీతీరంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ పీరయ్య శుక్రవారం సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. చింతమాను పల్లెకు చెందిన రామకృష్ణ, సిబెళగల్ కు చెందిన సుధాకర్ ట్రాక్టర్లు పట్టివేసి కేసు నమోదు చేశారు. బైతోలిలో పొలానికి దారి ఘర్షణపై సిఐ ఆరా తాశారు. మండలంలోని బైతోలిలో రాంబాబు పొలానికి దారి సమస్యలో ఘర్షణ తలెత్తగా సిఐ శ్రీదర్ శుక్రవారం అక్కడ పరిశీలించి ఆరా తీశారు.

ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలి : సిఐటియు



36 గంటల ధర్నా పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిఐటియు, అంగన్‌వాడీ నాయకులు

కోడుమూరు: ఈనెల 10 11 తేదీలలో జరిగే 36 గంటల ధర్నాకు అందరు తరిరావాలని కోరుతూ సిఐటియు నాయకులు గఫూర్ మియ్యా ఆధ్వర్యంలో గోడ పత్రికను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని , సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, అంగన్వాడీలను రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ తో కూడిన బెనిఫిట్ ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోతే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి కార్యకర్తలు ఈనెల 10 పెద్ద ఎత్తున కర్నూలు కలెక్టర్ కార్యాలయానికి తరలిరావాలని కోరారు. అంగన్వాడి నాయకురాలు అరుణ, హైమావతి, రజియా, భ్రమరాంబ, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ: 36 గంటల నిరాహార దీక్షను జయప్రదం చేయాలని సిఐటియు పత్తికొండ మండల కార్యదర్శి గోపాల్,అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ కోరారు. పత్తికొండ ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ ,సిఐటియు నాయకులు గోడ పత్రికలను విడుదల చేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శోభ మాట్లాడారు.

తుగ్గలి: అంగన్‌వాడీ వర్కర్ల, ఆయాల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అయ్యాయని సిఐటియు మండల కార్యదర్శి ప్రతాప్ అన్నారు. మండలం పరిధిలోని జొన్నగిరి గ్రామం లోని అంగన్వాడి సెంటర్ దగ్గర కలెక్టరేట్ ముట్టడి వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

32వ వార్డులో సమస్యలను పరిష్కరించాలి

పజాశక్తి- కర్నూలు హాస్పిటల్



కల్లూరు అర్బన్ 32 వార్డులోని సమస్యలను పుష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం 32వ వార్డులో సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకొన్నారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, ఎం.దావీదు, ఎంసి. ఆనందు మాట్లాడుతూ ముజఫర్ నగర్ లోని మురుగు కాలువ నీరు హంద్రీ నదిలో కలవడం ద్వారా హంద్రీ నది కలుషితం అవుతుందని తెలిపారు. నదిలో మురుగు నీరు నిలువ ఉండడం వల్ల దోమలు పందులకు నిలయంగా మారిందని అన్నారు. అక్కడ నుంచి దుర్వాసన రావడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలై అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే హంద్రీ నది వెంట మురుగు కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల31న జిల్లా కలెక్టర్ ఆఫీసును ముట్టడి చేస్తామని హెచ్చరించారు. వార్డు పర్యటనలో సిపిఎం నాయకులు జె.శ్రీనివాసులు, ఎస్,ముక్తి యార్ ఆంజనేయులు, ఎంపి ఆనంద్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, నాగరాజు, ముని, మహిళలు పాల్గొన్నారు. రాఘవేంద్ర నగర్‌లో పెండింగ్ లో ఉన్న కాలువలను పూర్తి చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న సిసి రోడ్లు కాలువలను శ్రీనివాస అపార్టుమెంట్లను పూర్తి చేయాలన్నారు. సిపిఎం శరీన్ నగర్ కార్యదర్శి జి.ఏసు వార్డులో పర్యటించారు. ఈ పర్యటనలో పి వెంకటస్వామి, జి.మౌలాలి, పి.మధు, వై.మద్దయ్య పాల్గొన్నారు.

అపర భగీరథుడు పుస్తకావిష్కరణ

కర్నూలు కలెక్టరేట్ : ప్రముఖ చరిత్ర అధ్యాపకులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా రచించిన అపర భగీరథుడు పుస్తకాన్ని శుక్రవారం మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశారని పేర్కొన్నారు. ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బుట్టారేణుక

క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ గడువు పెంపు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు పదవి కాలాన్ని మరో ఏడాది పెంచినట్లు వైస్ ఛాన్సలర్ సాయి గోపాల్ వెల్లడించారు. శుక్రవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో విసి సాయి గోపాల్ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి పని చేస్తున్న ఆయన పదవీకాలం పెంచేందుకు ఉన్నత విద్యా మండలికి సిఫార్సు చేశామన్నారు. అందుకు అనుగుణంగా మరోఏడాదిపాటు ఆయన సేవలను వర్సిటీకి వినియోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రిజిస్ట్రార్‌ను వైస్ ఛాన్సలర్, వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది సన్మానించారు.


మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

ప్రజల ఇంటి వద్దకే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జగనన్న సురక్ష ద్వారా అర్హులందరికి సర్టిఫికెట్లు అందజేస్తున్నామని కమిషనర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మీ ఇంటి వద్దకే వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న పథకాలకు కొన్ని సర్టిఫికెట్లు లేవనే కారణంతో, సంక్షేమ పథకాలు అందుకోని అర్హులైన పేదల కోసం, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం కర్నూలు నగరంలో 19వ వార్డు 47వ సచివాలయం ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలో ఏర్పాటు చేసిన క్యాంపులో సర్టిఫికెట్లను అందచేసారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

డాక్టర్ సత్య వరప్రసాద్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



డిఎంఇ డాక్టర్ సత్య వరప్రసాద్ సేవలు మరువలేనివని కర్నూలు జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కె. ప్రభుదాస్, వైసిపి నాయకులు రసూల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కర్నూలు స్పోస వారి ఆధ్వర్యంలో హార్ట్ ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయనను ఆత్మీ యంగా కలిసి వారు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్యశాస్త్రాన్ని అభ్యశించి, ఇంతింతై... వటుడింతై అన్నచందాన ...ఎన్నో సేవలు చేసి ఒక్కో మెట్టు ఎక్కి... రాష్ట్రంలోనే అత్యున్నత పదవిలో అకాడమిక్ డిఎంఇగా సేవలందించి ఇటీవలే పదవీవిరమణ పొందారన్నారు. ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ మరువలేరన్నారు. కర్నూలు స్పోస సభ్యులు విజయ భాస్కర్, మిగతా సభ్యులు పాల్గొన్నారు.

కొత్తరకం పత్తివిత్తన సాగుతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-సి బెళగల్ : కొత్త రకం పత్తి విత్తన సాగులతో అధికబడులు సాధించవచ్చని ఎడిఎ సాలు రెడ్డి, శాస్త్రవేత్తలు లక్ష్మీకళ్యాణి, లావణ్యలు పేర్కొన్నారు. శుక్రవారం ఎఒ మల్లేష్ కుమార్ సమక్షంలో రైతులతో సమీక్షించి శిక్షణాకార్యక్రమం చేపట్టారు. ఇక్కడే కొత్త రకం విత్తనాలు అందుబాటులో నున్నాయని గ్రామాల్లో అవగాహన విస్తృతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థులకు మెరుగైన విద్య

- ఎంఇఓలు సావిత్రమ్మ, బాలానాయుడు

ప్రజాశక్తి - చిప్పగిరి


ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఓ

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఎంఇఓలు సావిత్రమ్మ, బాల నాయుడు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎంఆర్‌సి భవనంలో ఎంఇఓలు సావిత్రమ్మ, బాలానాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ కొండయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఇఓలు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు కృషి చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు, విద్యార్థుల అటెండెన్స్‌ను తప్పకుండా పాటించాలని తెలిపారు. జగనన్న విద్యా దీవెన, స్టూడెంట్స్ డ్రాపౌవుట్స్, నాడు-నేడు కార్యక్రమం ద్వారా జరుగుతున్న పనులపై దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో టీసీలు తీసుకెళ్తున్న విద్యార్థులు, ఏ పాఠశాలలో, కళాశాలలో చేరుతున్నారో వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి, వివరాలు సేకరించాలన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి-ఆలూరు


బీసీ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు

బీసీ విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శుక్రవారం ఆలూరులోని ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జయరామ్ మాట్లాడారు. వెనుకబడిన నియోజకవర్గంలో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని, విద్యార్థులు తక్కువగా ఉన్నారనే నెపంతో మూసి వేస్తున్న హాస్టల్ గురించి ఎస్ఎఫ్ఐ నాయకులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. అధికారులతో మాట్లాడి హాస్టల్‌ను ఆలూరుకు మార్చినట్లు చెప్పారు. పక్క మండలాల నుంచి వచ్చి ఆలూరులో చదివే బీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి, మండల కన్వీనర్ వీరేష్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అసిస్టెంట్ అధికారి లక్ష్మీనారాయణ, హాస్టల్ వెల్ఫేర్ అధికారి శివుడు, వార్డెన్లు సంపత్ కుమార్, విశ్వనాథ్ రెడ్డి, మాదప్ప, మద్రెమ్మ, అనిమిరెడ్డి, కోటేశ్వరయ్య, వలీ పాల్గొన్నారు.

హాస్టల్‌ను ప్రారంభించిన మంత్రికి కృతజ్ఞతలు

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

హాస్టల్‌ను ప్రారంభించిన మంత్రి జయరామ్‌కు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పేద విద్యార్థుల వసతి కోసం మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను ఎస్ఎఫ్ఐగా కోరగా హాస్టల్‌ను ఆలూరుకు మార్చి నూతన బీసీ బాలుర వసతి గృహాన్ని ప్రారంభించినందుకు మంత్రి, ఆయన సోదరుడు నారాయణ స్వామి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులకు డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, పోతురాజు కృతజ్ఞతలు తెలిపారు.



'గడపగడపకు'ను జయప్రదం చేయండి

- ఎంపిపి దంపతులు జూటూరు హేమలత మారయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈనెల 10న చిప్పగిరిలో జరిగే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపిపి జూటూరు హేమలత మారయ్య కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 'గడపగడప'కు కార్యక్రమాన్ని చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ హాజరవుతారని చెప్పారు. ప్రతి గడపకూ తిరిగి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారుంటే మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతారని తెలిపారు.

ఎయిడ్స్ నివారణ సొసైటీ రాష్ట్ర జెడి పర్యటన

ప్రజాశక్తి - గోనెగండ్ల


వైద్యులతో మాట్లాడుతున్న రాష్ట్ర జెడి

ఎయిడ్స్ నివారణ సొసైటీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ శుక్రవారం గోనెగండ్ల మండలంలో పర్యటించారు. గోనెగండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అధికారులు, స్థానిక వైద్యులతో కమ్యూనల్ డిసీజెస్, నాన్ కమ్యూనల్ డిసీజెస్ గురించి జరుగుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో జరుగుతున్న ఎన్‌సిడి సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. మండలంలో 20 మంది ఎఎన్ఎంలు, 65 మంది ఆశావర్కర్లు, 61 బృందాలతో, 10,089 ఇళ్లలో 46,522 మందిని పరీక్షించామని, అందులో 92 మంది అనుమానిత కేసులుగా గుర్తించారని తెలిపారు. వారందరికీ తగిన వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత అవసరమైన వైద్య సహాయం అందజేస్తామన్నారు. జిల్లా కుష్టు, టిబి నివారణ అధికారి డాక్టర్ భాస్కర్, జిల్లా హెల్త్ ఎడ్యుకేషనల్ డిప్యూటీ అధికారి దేవప్రసాద్, డిపిఎంఒ చంద్రయ్య శెట్టి, హెల్త్ సూపర్‌వైజర్ పరమేశ్వరప్ప, స్థానిక వైద్యాధికారిని రవళి, వైద్యులు రజనీ పాల్గొన్నారు.

టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' లేదు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్


జంపాపురంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

పక్క రాష్ట్రాల మేనిఫెస్టోలను కాపీ చేసి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' అంటూ టిడిపి నాయకుల బస్సుయాత్ర బూటకపు మాటలతో చేపట్టడం హాస్యాస్పదమని, టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ లేదని, 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఎన్నిక కావడం ఖాయమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని జంపాపురం గ్రామ సచివాలయంలో ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచి ఆరోన్ అధ్యక్షతన రెండోరోజూ 'గడపగడపకు మన ప్రభుత్వం' చేపట్టారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ఆదర్శమన్నారు. ఎస్ఐ రాజారెడ్డి, ఎంపిపి ఈరన్న, మండల వైద్యాధికారి అనురూప్, ఎంఇఒ నాగేశప్ప, ఎఇలు వీరేష్, శేఖర్ బాబు, ఎఒ రాజు, ఎపిఎం సత్యమ్మ, బెట్టనగౌడ్, శ్రీనివాస రెడ్డి, ఎన్.నాగరాజు, జగదీష్ స్వామి, జంపాపురం బసిరెడ్డి, బుళ్లి నరసింహులు, మల్లికార్జున గౌడ్, జొల్లయ్య, ఐరనగల్లు సర్పంచి రామాంజనేయులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని 23వ వార్డు సచివాలయంలో రెండోరోజూ 'గడపగడపకు' నిర్వహించారు. వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు.


ఎమ్మిగనూరులో లబ్ధి పత్రాలను అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

పాదయాత్రను జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - కౌతాళం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

తుంగభద్ర నది నుంచి వరద కాలువ సాధన కోసం ప్రజలు, కార్యకర్తలు తరలి రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, సీనియర్ నాయకులు కె.మల్లయ్య కోరారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో మండల కార్యదర్శి ఈరన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలం ప్రతేడాది అతివృష్టి, అనావృష్టి, కరువు కాటకాలకు గురవుతోందని తెలిపారు. రైతు ఆత్మహత్యలు, వలసలు పెరిగిపోతున్నాయన్నారు. రైతు ఆత్మహత్యలు, వలసల నివారణకు మండలంలోని మేళిగనూరు దగ్గర వరద కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు. వరద కాలువను నిర్మిస్తే మండలం సస్యశ్యామలమై వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకొని వరద కాలువ కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వరద కాలువ నిర్మాణాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వరద కాలువ సాధన కోసం ఈనెల 26 నుంచి 31 వరకు ఆదోని నుంచి కర్నూలు వరకు పాదయాత్ర చేసి, 31న కర్నూలు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ కలిసి రావాలని కోరారు. సిపిఎం మండల కన్వీనర్ మేలి గిరి ఈరన్న, వెంకటేశులు, రామలింగ, మారయ్య, హనుమంతు, బసవ, ఖాదర్‌బీ, రామాంజనేయులు, వన్నూరు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలందరికీ మేలు

- వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


లబ్ధిపత్రాలను అందజేస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 'జగనన్న సురక్ష'తో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని వైసిపి మండల అధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వి.తిమ్మాపురం, వగరూరు గ్రామాల్లో ఎంపిడిఒ మణిమంజరి ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'జగనన్న సురక్ష' ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఇప్పటికే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. తహశీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ వేణుగోపాల్ రాజ్ పాల్గొన్నారు.

కేదారి ల్యాబ్ అండ్ డయాగ్నోస్టిక్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కోసిగి రూరల్


పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కోసిగిలో మఠం బ్రదర్స్, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు మహాంతేష్ స్వామి, వైసిపి యువజన నాయకులు జగదీష్ స్వామి వారి కేదారి ల్యాబ్ అండ్ డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మండల ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులో అధునాతన పరికరాలతో రక్త పరీక్షలు చేపట్టడం శుభపరిణామమని తెలిపారు. అనంతరం పరీక్షల వివరాలను స్వయంగా తెలుసుకున్నారు. ఎస్ఐ రాజారెడ్డి, ఎంపిపి ఈరన్న, బెట్టనగౌడ్, శ్రీనివాసరెడ్డి, ఎన్.నాగరాజు, మంగమ్మ, బుళ్లి నరసింహులు, మల్లికార్జున గౌడ్, ఖలీల్ అహ్మద్, జంపాపురం బసిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తారాపురం గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో, టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు అధ్యక్షతన 'భవిష్యత్తుకు గ్యారెంటీ' బస్సు యాత్ర నిర్వహించారు. ఈ బస్సు యాత్ర తారాపురం గ్రామం నుంచి ప్రారంభమై రంగాపురం, చిన్నకడబూరు, పెద్దకడబూరు గ్రామంలో సాగింది. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడారు. జగన్ పాలన అవినీతిమయంగా మారిపోయిందని మండిపడ్డారు. తన తండ్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండుసార్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించినా ఏనాడూ అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని, నిజాయితీగా పరిపాలించామని గుర్తు చేశారు. టిడిపి కార్యకర్తలపై పోలీసుల చేత తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో జగన్ సర్కారుపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. టిడిపి మహానాడు వేదికగా టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన మహిళలకు 'మహాశక్తి', యువగళం, అన్న దాత, ఇంటింటికి నీరు, బీసీలకు రక్షణ చట్టం, పూర్ టు రిచ్ ఆరు అంశాల మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పనులను ప్రారంభించేలా ముఖ్యమంత్రి జగన్‌పై ఒత్తిడి తెచ్చే దమ్ము, ధైర్యం జిల్లా మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఎక్కడిదని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లా రైతులకు అంకితం చేసి మాట నిలబెట్టుకుంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపి జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, ఆదోని ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, పత్తికొండ ఇన్‌ఛార్జీ కెఇ.శ్యాంబాబు, కోడుమూరు ఇన్‌ఛార్జీ ఆకెపోగు ప్రభాకర్, జిల్లా మహిళా అధ్యక్షులు కవిత, ఫుడ్ కమిటీ మాజీ ఛైర్మన్ గుడిసె కృష్ణమ్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, పెద్దకడబూరు మాజీ ఎంపిపి నరవ శశిరేఖ, టిడిపి మండల అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్న, మంత్రాలయం మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి పాల్గొన్నారు.



బస్సుయాత్రలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఆదోనిలో ప్రేమ జంట ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శ్రీనివాస భవన్ 309 రూమ్‌లో ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గమనించిన హోటల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారమిచ్చారు. టూ టౌన్ సిఐ శ్రీనివాస్ నాయక్ వివరాల మేరకు... ఆత్మహత్య సమాచారం రావడంతో శ్రీనివాస్ భవన్‌కు చేరుకొని ప్రదేశాన్ని పరిశీలించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామానికి చెందిన కురువ రాముడు (25), చిత్తూరు జిల్లా వనబాకం మానస (24)గా గుర్తించామన్నారు. యువతి ఉరేసుకొని ఉండగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలించామన్నారు. సంఘటనకు గల కారణాలు దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉందని తెలిపారు. ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశామన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిన్నహోతూరులో సమస్యలు పరిష్కరించండి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు, మండల సీనియర్ నాయకులు రామాంజినేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం సచివాలయం ముందు ధర్నా చేపట్టారు. ఇంజినీర్ అసిస్టెంట్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాపురం రిజర్వాయర్ నుంచి సక్రమంగా నీరు పంపింగ్ చేయక పోవడం వల్ల వారానికోసారి తాగునీరు వస్తోందని తెలిపారు. ఫిల్టర్ నీరు కొని తాగే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి వేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ప్రగల్భాలు చెప్పడం తప్ప ఆచరణలో లేదని విమర్శించారు. సచివాలయ అధికారులు సమయానికి విధులకు హాజరు కాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సక్రమంగా విధులకు హాజరు కాని సచివాలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టాలని, పశువుల ఆస్పత్రి భవనానికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. చెడి పోయిన చేతి పంపులను వెంటనే బాగు చేయించాలన్నారు. సిపిఎం గ్రామ నాయకులు గర్జన్న, నరసప్ప, జయరాజు పాల్గొన్నారు.

మాజీ వెయిట్ లిఫ్టర్స్‌ను గుర్తిస్తాం

- సౌకర్యాల మెరుగుదలకు కృషి

- ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


ఎమ్మెల్యే ఎర్రకోటను సన్మానిస్తున్న క్రీడాకారులు

మాజీ వెయిట్ లిఫ్టర్స్‌ను గుర్తిస్తామని, సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం పట్టణంలో గత 35 ఏళ్ల క్రితం దేహదారుఢ్యం, మానసకోల్లాసం కోసం ఏర్పాటు చేసుకున్న వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు గతాన్ని నెమరు వేసుకుంటూ అందరూ కలవాలని మాచాని శివకుమార్, ఎంకప్ప, దేవరాజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిని సన్మానించారు. మాజీ వెయిట్ లిఫ్టర్స్ శివకుమార్, ఎంకప్ప, దేవరాజు మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సహాయ, సహకారాలను అందించారని తెలిపారు. ఎమ్మిగనూరుకు మంచి పేరు, ఖ్యాతిని తీసుకురావాలని తమను ప్రోత్సహించారని చెప్పారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడకు పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. అవసరమైన స్థలాన్ని కేటాయిస్తే ఒక కోచింగ్ సెంటర్‌ను కట్టించి యువతకు అందుబాటులో ఉంచుతామని కోరారు. అనంతరం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడారు. కావాల్సిన స్థలాన్ని కచ్చితంగా ఏర్పాటు చేస్తానని తెలిపారు. క్రీడాకారులు, వైస్ ఎంపిపి పోలయ్య, రహీం, నీలకంఠ, లింగ బాయి పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

- వేదవతి ప్రాజెక్టు సాధన కోసం సిపిఐ పాదయాత్ర

ప్రజాశక్తి-ఆలూరు

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల పట్ల వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య విమర్శించారు. శుక్రవారం వేదవతి ప్రాజెక్టును 8 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించాలని సిపిఐ ఆధ్వర్యంలో మొలగవల్లి గ్రామం నుంచి ఆలూరు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలూరు ప్రాంతంలో సాగు, తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. వేదవతి ప్రాజెక్టులో రూ.120 కోట్ల పనులు జరిగితే కేవలం రూ.16 కోట్లు మాత్రమే విడుదల చేయడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపి వేశారన్నారు. వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా నాయకులు నబి రసూల్, భూపేష్, తిమ్మయ్య, మండల కార్యదర్శులు విరుపాక్షి, రామాంజనేయులు, హోతూరప్ప, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి శివ పాల్గొన్నారు.



మొలగవల్లి గ్రామంలో పాదయాత్రను ప్రారంభిస్తున్న రామచంద్రయ్య

డ్రెయినేజీ కాలువల నిర్మాణాలు చేపట్టాలి

- సచివాలయ అధికారులకు సిపిఎం వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ బీసీ కాలనీ, పాత సినిమా టాకీస్ కాలనీలో డ్రెయినేజీ కాలువలు లేక ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, మండల నాయకులు యూసుఫ్ బాష తెలిపారు. శుక్రవారం సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో మురుగునీరు, వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తోందని, ప్రజలు రోడ్లపై నడవలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. బస్టాండ్ సమీపంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పందికోన రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువలకు నీటిని వదలాలని కోరారు. సిపిఎం నాయకులు అశోక్, నాగేష్, రైతులు పాల్గొన్నారు.

ఉప్పరలు ఏకం కావాలి

- ఉప్పర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - హాలహర్వి

ఉప్పరల అభివృద్ధి కోసం అందరూ ఏకం కావాలని నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని చింతకుంట గ్రామంలో ఉప్పర సంఘం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉప్పర గ్రామం సంఘం సభ్యులు, మహిళలు భగీరథ చిత్రపటాన్ని డప్పు, మేళాలతో ఊరేగించారు. ఆదోని ఉప్పర సంఘం అధ్యక్షులు గోనబావి గోపాల్, ఆదోని నాయకులు మల్లికార్జున, సోమశేఖర్, బళ్లారి ఉప్పర సంఘం ఎర్రిస్వామి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఉప్పర సంఘం ప్రెసిడెంట్‌గా యు.శేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా లాల్‌స్వామి, సెక్రటరీగా యు.శేషాద్రి, ట్రెజరర్‌గా యు.రంగప్ప, గౌరవాధ్యక్షులుగా యు.శ్రీనివాసులు, గౌరవ సలహాదారులుగా యు.హనుమంతు, యు.శేఖర్, యు.సురేంద్ర, యు.రంగస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

10, 11న కలెక్టరేట్ ముందు ధర్నా

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఈనెల 10, 11న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధనమ్మ, నాగలక్ష్మి కోరారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో సిడిపిఒకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. బడ్జెట్‌లో నిధులు పెంచాలని, అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పద్మావతి, శ్రీదేవి, శైలజ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి : జడ్‌పిటిసి

ప్రజాశక్తి - చిప్పగిరి



కీర్తిశేషులు వైఎస్.రాజ శేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా చిప్పగిరి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే ఉచిత గుండె వైద్య శిబిరానికి ప్రతి ఒక్కరూ హాజరై సద్వినియోగం చేసుకోవాలని జడ్‌పిటిసి, పంచాయతీరాజ్ జోనల్ వింగ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు విరుపాక్షి కోరారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతపురం జిల్లాకు చెందిన కిమ్స్ హాస్పిటల్ వారి సహకారంతో చిప్పగిరిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు హాజరై పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కూడా అందిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాలతో పాటు అందరికీ సమ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేలకొరిగిన భారీ వృక్షం

ఆదోని :



పట్టణంలోని వెంకన్న బావి ప్రాంతంలో భారీ వృక్షం నేలకొరిగింది. నిత్యం ప్రజలు తిరిగే ప్రాంతమైనప్పటికీ ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రధాన రోడ్డు కావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి భారీ వృక్షాన్ని తొలగించాలని ప్రజలు శుక్రవారం కోరారు.



ఈ కెవైసి, ఎన్‌సిపిఐ లింక్ చేసుకోండి

- నేడు ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లు ప్రారంభం
- ఆర్‌బికెలలో సమృద్ధిగా ఎరువులు నిల్వలు
- జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పిఎం కిసాన్ లబ్ది కొరకు జిల్లాలో ఈకెవైసి, ఎన్‌సిపిఐ లింకేజీ చేసుకోని రైతులు తక్షణమే చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పిఎం కిసాన్ కింద రైతులకు 13 దశలుగా అమౌంట్ పడిందని, 14వ దఫా కింద లబ్ది పొందేందుకు ఈ కేవైసి చేసుకోవాలని అలాగే రైతుల బ్యాంక్ అకౌంట్ లకు ఎన్ సిపిఐ లింకేజీ తక్షణమే చేసుకోవాలన్నారు. ల్యాండ్‌కు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని అప్పుడే 14వ విడత పిఎం కిసాన్ అమౌంట్ పడుతుందన్నారు. జిల్లాలో 2,16,743 మంది రైతులకు గాను ఇంకా 23,952 మంది రైతుల ఈకేవైసి పెండింగ్ ఉందన్నారు. ఎన్‌సిపిఐ లింకేజీ చేయించుకోవలసిన రైతులు వారి బ్యాంక్ ఖాతా ఉన్న బ్యాంక్ ల వద్దకు వెళ్లి కొత్తగా ఎన్‌సిపిఐ లింకేజీ చేయించుకోవాలని, అక్కడ కానీ పక్షంలో పోస్ట్ ఆఫీస్‌కు వెళ్లి కొత్తగా రైతు పేరు మీద ఖాతా ప్రారంభించాలని ఆయన పేర్కొన్నారు. ఖాతా ప్రారంభించిన 24 గంటల్లోనే ఎన్‌సిపిఐ లింకేజీ జరిగిపోతుం దన్నారు. ఎన్‌సిపిఐ లింకేజీ చేయించుకోని రైతులు జిల్లాలో 2,825 మంది రైతులు పెండింగ్ ఉన్నారన్నారు. కాబట్టి ఈ- కెవైసి, ఎన్‌సిపిఐ లింకేజీ త్వరగా పూర్తి చేసుకోవాలని, అప్పుడే పిఎం కిసాన్ అమౌంట్ లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి టి మోహన్ రావు వెల్లడించారు.

నేడు ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు ప్రారంభోత్సవం

రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8న వ్యవసాయానికి సంబందించిన ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్‌లను ప్రారభించునున్నారు. పాణ్యం, కోవెలకుంట్ల, నందికొట్కూరు, డోన్, ఆత్మకూర్‌లలో ఈ ల్యాబ్‌లను ప్రారంబించునున్నారు. ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్‌లను రైతులు సద్విని యోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. విత్తనాలు, ఎరువుల శాంపిల్స్ సేకరించి ఈ ల్యాబ్‌లలో ఉచితంగా పరీక్షించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు తెలిపారు.

ఆర్‌బికెలలో సంవృద్ధిగా ఎరువుల నిల్వలు...

జిల్లాలోని ప్రతి ఆర్‌బికేలో ఎరువులు సంవృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు పేర్కొన్నారు. 411 రైతు భరోసా కేంద్రాలకు గాను 250 ఆర్‌బికేలలో 4,899 మెట్రిక్ టన్నుల యూరియా, డిఏపి, కాంప్లెక్స్ వంటి ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా ఆర్‌బికేల పరిధిలో ఉన్న రైతులు ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

జగనన్న సురక్ష ద్వారా సిసిఆర్‌సి కార్డులు

జిల్లాలో కౌలు రైతులకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సీసీఆర్‌సి కార్డులు పంపిణీ చేస్తున్నట్లు డిఏఓ తెలిపారు. జిల్లాలో 12,890 సిసిఆర్‌సి కార్డులు కౌలు రైతులకు ఇవ్వాలని టార్గెట్ కాగా 9,200 పూర్తి అయ్యా యన్నారు. మిగిలినవి గ్రామ వాలంటీర్ ని, రెవిన్యూ అధికారులను కలిసి తీసుకోవాలన్నారు. సిసిఆర్‌సి కార్డులు లేకుంటే ప్రభుత్వానికి సంబంధి ంచిన వ్యవసాయ పథకాలు ఈ క్రాప్ బుకింగ్, విత్తనాలు, సబ్సిడీ పొందలేక పోవడం, క్రాఫ్ ఇన్సూరెన్స్, పంట నష్టం పి ఎం కిసాన్, రైతు భరోసా వంటి పథకాలు కోల్పోతారని కౌలు రైతులకు సూచించారు.

సాగని సాగు



- ఇప్పటి వరకూ 7 శాతమే - లోటు వర్షపాతంలో ముందుకు పడని అడుగులు

> నంద్యాల జిల్లాలో సాగు ఆశించిన రీతిలో ముందుకు సాగడం లేదు. లోటు వర్షపాతంతో విత్తనాలు వేసేందుకు అన్నదాతలు అడుగులు ముందుకు వేయడం లేదు. వరుసగా నష్టాలు మూటగట్టుకుంటుండటంతో విత్తనం విత్తాలా వద్దా అనే సందేహాలు రైతుల్లో నెలకొన్నాయి...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వ్యవ సాయమే ప్రధానంగా ఉన్న జిల్లాల్లో నంద్యాల జిల్లా ఒకటి. తొలకరి వర్షాలు ప్రారంభమై దాదాపు నెల కావస్తున్నా ఇప్పటి వరకూ ఖరీఫ్ సాగుకు అడుగులు ముందుకు పడటం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాధారణ సాగులో కేవలం 7 శాతం మాత్రమే విత్తనాలు వేశారు. జిల్లాలో మొత్తం సాధారణ సాగు 5,93,482.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 41,596 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. వర్షాలు ఆశించిన రీతిలో పడకపోవడంతో విత్తనం విత్తేందుకు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటగా ఉండే వరి సాధారణ సాగు 1,76,315 ఎకరాలు కాగా కేవలం 507.5 ఎకరాల్లో మాత్రమే ఇప్పటి వరకూ సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ సాగు 1,04,745 ఎకరాలు కాగా 10,485 ఎకరాల్లో విత్తనాలు విత్తారు. కంది సాధారణ సాగు 93,877.5 ఎకరాలు కాగా 9,135 ఎకరాల్లో, మినుము సాధారణ సాగు 16,982.5 ఎకరాలు కాగా 2710 ఎకరాల్లో సాగు చేశారు. వేరుశనగ సాధారణ సాగు 39,510 ఎకరాలు కాగా 3,442.5 ఎకరాల్లో, ఆముదం సాధారణ సాగు 7,455 ఎకరాలు కాగా 4,442.5 ఎకరాల్లో సాగయ్యాయి. సోయాబీన్ సాధారణ సాగు 5,737.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా కేవలం 97.5 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 63,965 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 3,715 ఎకరాల్లో సాగైంది. ఉల్లి సాధారణ సాగు 10,182.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 197.5 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో మిరప సాధారణ సాగు విస్తీర్ణం 25,010 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ కేవలం 515 ఎకరాల్లో సాగైంది. గతేడాది మిర్చి పంట తెగుళ్లతో భారీగా నష్టాలు మూటగట్టుకోవడంతో రైతులు ఈ ఏడాది మిరప సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. పసుపు సాధారణ సాగు 2,737.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 130 ఎకరాల్లో, టమోటా సాధారణ సాగు 4,590 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1,257.5 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇతర పంటల సాగు విస్తీర్ణం 17,347.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1,745 ఎకరాల్లో సాగయ్యాయి.

చిరు ధాన్యాలపైనా ప్రభావం

లోటు వర్షపాతం ప్రభావం చిరు ధాన్యాల సాగు పైనా పడింది. జిల్లా వ్యాప్తంగా సజ్జ సాధారణ సాగు 6,507.5 ఎకరాలు కాగా 2,612.5 ఎకరాల్లో మాత్రమే ఇప్పటి వరకూ సాగు చేశారు. కొర్ర సాధారణ సాగు 4,860 ఎకరాలు కాగా కేవలం 497.5 ఎకరాల్లో సాగు చేశారు. జొన్న సాధారణ సాగు 5,797.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ అసలు సాగు ప్రారంభించలేదు. వర్షం అవసరమైన రీతిలో పడకపోవడమే సాగు ముందుకు సాగకుండా పోవడానికి కారణమని పలువురు చెబుతున్నారు. అన్నదాతలు మాత్రం వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

సాగు శాతాల్లో...

పంట	సాగైన శాతం
వరి	0.28
సజ్జ	40
మొక్కజొన్న	10
కొర్ర	10.2
కంది	9.7
మినుము	16
వేరుశనగ	8.7
ఆముదం	59.6
సోయాబీన్	1.7
పత్తి	5.8
మిరప	2.1
ఉల్లి	1.9
పసుపు	4.7
ఇతరములు	10
మొత్తం	7

కడమల కాలువలో విస్తంభిస్తున్న అతిసార

- నియంత్రించడంలో వైద్య ఆరోగ్య శాఖ విఫలం
- నంద్యాల ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలలకు క్యూ కడుతున్న ప్రజలు



నంద్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతిసార రోగులు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని కడమల కాలవ గ్రామపంచాయతీలో అతిసార వ్యాధి రోజురోజుకు విజృంబిస్తోంది. బక్రీద్ పండుగ నుండి ఇప్పటివరకు గ్రామంలో అతిసార వ్యాధి రోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ వైద్య శిబిరం నిర్వహిస్తున్నా.. అతిసార వ్యాధి మూలాలను కనిపెట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. గత వారం రోజుల నుండి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని పరిస్థితులను గమనిస్తూ అతిసార వ్యాధిని నియంత్రించాల్సిన వైద్య బృందాలు ఇంతవరకు అత్యసార వ్యాధికి మూలాలను కనిపెట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి నుండి వస్తుందని ఉద్దేశంతో అధికారులు తాగునీటిని ఈ ర్నపాడు గ్రామం నుండి నుండి ట్యాంకర్ల ద్వారా శుద్ధ జలాన్ని సరఫరా చేస్తున్నా ఇంతవరకు అతిసార వ్యాధి నియంత్రణ కాకపోవడం గ్రామ ప్రజలు భయాందోళన గురవుతున్నారు. దాదాపు 60 మంది నంద్యాల ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని రోజు నాలుగైదు కొత్త కేసులు నమోదు అవుతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ తెలియజేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని 24 గంటలు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

శుక్రవారం డిఎమ్‌హెచ్ఓ ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం గ్రామంలో పరిస్థితులను పరిశీలించింది. వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ వినయ్ అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ దినేష్, డాక్టర్ కాంతారావు, డాక్టర్ అనిత, వైద్య సిబ్బందితో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో పరిస్థితిలను సమీక్షించడం జరుగుతుందని డిఎంహెచ్వో వెంకటరమణ తెలిపారు.

సరైన వైద్యం అందడం లేదు



మా గ్రామంలో బక్రీద్ పండగ ఏకాదశి పండగ రోజు నుండి అతిసార వ్యాధిగ్రస్తులు తిరుగుతూ ఉన్న వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సరైన వైద్యం అందక నంద్యాలలోని ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స చేసుకుంటున్నాను.

- లక్ష్మీదేవి, కడమల కాలువ గ్రామం.

అతిసారను త్వరగా అరికట్టాలి



అతిసార వ్యాధితో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. బక్రీద్ పండగ సందర్భంగా ఫుడ్ పాయిజన్ అయిందని అధికారులు చెప్పి పండగ పోయి వారం రోజులు గడుస్తున్నా ఇంకా రోగులు పెరుగుతున్నారు. వెంటనే జిల్లా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు అతిసార వ్యాధి నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలి.

- మహబూబ్ బాషా, కడమలకల్వ గ్రామం.



దొంగ నోట్ల చలామణిపై అప్రమతంగా ఉండాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గత కొద్దిరోజుల ముందు (ఆర్‌బిఐ) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు 2000 రూపాయల నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో దొంగ నోట్లు చలామణి చేసే ముఠా అడ్డు అదుపు లేకుండా ప్రజలను వివిధ మార్గాల ద్వారా మోసం చేస్తున్నారని జాగ్రత్తలు వహించాలని ఎస్పీ పేర్కొన్నారు. శుక్రవారం మీడియాతో ఎస్‌పి మాట్లాడుతూ వాట్సాప్ ద్వారా నోట్ల కట్టలను వీడియో తీసి పంపించి ఆశ చూపించి మోసం చేస్తున్నారని జిల్లా ప్రజలు అప్రమతంగా ఉండాలని సూచించారు. తొందరగా డబ్బు సంపాదించాలనే అత్యాశకు వెళ్లకూడదని పేర్కొన్నారు. ఎవరైనా అత్యాశ చూపి రూ.2000 నోట్లకు బదులుగా 500 రూపాయల నోట్లు ఇస్తాము అంటే వెంటనే 9194987020కు గాని, 100 నంబర్‌కు గాని ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ తెలిపారు.

జలకనూరు బాధితుల సమస్యను పరిష్కరిస్తాం

సిపిఎం నాయకులకు ఎమ్మెల్యే ఆర్థర్ హామీ



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కె.ప్రభాకర్‌రెడ్డి, ఎం.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - మిడుతూరు

మిడ్తూరు మండలం జలకనూరు గ్రామంలో గత 40 సంవత్సరాల నుండి వాగు పోరంబోకు స్థలంలో గేదలుషెడ్లు, గడ్డివాములు, పశువుల పాకలు వేసుకున్న రైతులకు న్యాయం చేస్తానని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ హామీ ఇచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె. ప్రభాకర్ రెడ్డి, సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు నాయకత్వంతో ఎమ్మెల్యే తోగురు ఆర్థర్‌కు, తహశీల్దార్ ప్రకాష్ బాబుకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. శుక్రవారం కె. ప్రభాకర్ రెడ్డి, ఎం.నాగేశ్వరావు, సిపిఎం నాయకులు పి.పకీర్ సాహెబ్, టి.గోపాలకృష్ణ, వి.వేణుగోపాల్ జలకనూరు బాధితులతో కలిసి కర్నూలులో ఎమ్మెల్యే తోగుర్ ఆర్థర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా జలకనూరు గ్రామంలో వాగు పోరంబోకు స్థలంలో వ్యవసాయ పనిముట్లు, గేదెలు, పశుగ్రాసం, గడ్డివాములు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పేదలు వేసుకున్న గడ్డివాములను తొలగిస్తూ మిమ్మల్ని సంపుతానం టూ దౌర్జన్యాలకు పాల్పడుతూ పేదలను బెదిరిస్తున్న పాషామీయా, శాలిబాష, నజీర్‌బాష ,హబీబుల్లాలపై తక్షణమే చర్యలు తీసుకొని పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. మిడ్తూరు తహశీల్దార్‌తో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడి అనుభవంతో ఉన్న పేదలకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం మిడ్తూరు తహశీల్దార్ ప్రకాష్ బాబుకు కూడా సిపిఎం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. తహశీల్దార్ వెంటనే స్పందించి ఆర్ఐతో విచారణ చేయించి బాధితులకు న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు టి.ఓబులేసు, రమణయ్య, బాధితులు జైలాద్దీన్, షేక్షావలి ,ఉస్మాన్ బాష, భానుబి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

ఆర్‌బికెల్లో డిఎఒ తనిఖీలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండల పరిధిలోని ఎర్రగుడి దిన్నే రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు ఆకస్మిక తనిఖీ చేశారు. శుక్రవారం ఎర్రగుడిదిన్నె రైతు భరోసా కేంద్రంలో గ్రామీణ వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఎఏబి సభ్యులతో వ్యవసాయ, వ్యవసాయ సంబంధిత పథకాలపై అవగాహన కల్పించారు. రైతు భరోసా కేంద్రంలో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలియజేశారు. కావలసిన రైతులు కియోస్కోలో ఆర్డర్ పెట్టి తీసుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి, రుద్రవరం మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి రాజు వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే డెంగీ దూరం

ప్రజాశక్తి - రుద్రవరం

దోమలను నివారించడం ద్వారా డెంగ్యూను నివారించవచ్చని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బాబు తెలిపారు. శుక్రవారం డెంగ్యూ నివారణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సిబ్బంది సచివాలయ ఏఎన్ఎం, అంగనవాడి, ఆశా కార్యకర్తలతో అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దోమతెరలు వాడాలని, మురికి నీరు ఉన్నచోట దోమలు వద్ధి చెందకుండా వేస్ట్ ఆయిల్ కిరోసిన్ బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. విపరీతమైన నొప్పులు జ్వరం వచ్చిన సమయంలో వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి, పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంపిహెచ్ ఈఓ బాబయ్య, ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ బాబు హెల్త్ సిబ్బంది

సర్కారు బడుల్లో డిజిటల్ బోధన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యారంగంలో వినూత్న మార్పులు తీసుకువచ్చి సర్కారు బడుల్లో డిజిటల్ బోధనను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లూరు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్ డిజిటల్ తరగతులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. డిజిటల్ తరగతులను ప్రారంభించి డిజిటల్ ద్వారా అధ్యాపకులు విద్యార్థు లకు బోధించే విద్యా విధానం ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలుసు కున్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్ లకు దీటుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు - నేడు అనే మహత్తర కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి మహర్దశకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. నేడు ఇల్లూరు కొత్తపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 డిజిటల్ తరగతులను ప్రారంభించడం జరిగిందని, డిజిటల్ విద్య ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యను అర్థం చేసుకునే సౌలభ్యాన్ని ముఖ్యమంత్రి అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైసిపి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి,ఇల్లూరు కొత్తపేట గ్రామ సర్పంచ్ గోకుల రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు కుమార్ బాబు యాదవ్, పాండు రంగారెడ్డి, సుధాకర్ రెడ్డి, పినాకపాణి, రామచంద్రారెడ్డి, సుధాకర్, లక్ష్మయ్య, వైసిపి నాయకులు కర్రేద్దుల సుబ్బారెడ్డి రాఘవరెడ్డి, లక్ష్మిరెడ్డి, చాంద్ బాషా లక్ష్మయ్య, సురేంద్రబాబు, వెంకటసుబ్బారెడ్డి ,బివి సుబ్బారెడ్డి సుధాకర్, మునిస్వామి, చోటా హుస్సేన్, విద్యా కమిటీ చైర్మన్ సుబ్బ రత్నమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డిజిటల్ తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

వైసిపికి ఒక్క అవకాశం ఇస్తే రాష్ట్రం నాశనం : మాండ్ర



మహిళలతో మాట్లాడుతున్న మాండ్ర

ప్రజాశక్తి - కొత్తపల్లి

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ అని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్క అవకాశం అని అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టిడిపి నంద్యాల పార్లమెంటు ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, టిడిపి నందికొట్కూరు ఇన్చార్జి జయసూర్య పేర్కొన్నారు. శుక్రవారం నాడు వారు కొత్తపల్లి మండలంలోని గువ్వల కుంట్ల గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆడపడుచులకు రక్షణ కరువైందని అన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందంటే కేవలం టిడిపి హయంలోనే జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు జడ్డు వెంకటరెడ్డి, క్లస్టర్ కోఆర్డినే టర్ లింగస్వామి గౌడ్, నియోజకవర్గ టిడిపి నాయకులు ప్రసాద్ రెడ్డి, రఘురాం రెడ్డి, తిమ్మారెడ్డి, మహేష్ నాయుడు, రమేష్ రెడ్డి, గోవిందు, వెంకటేశ్వరరావు, జాకీర్, మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు డోన్ కౌన్సిల్ ఆమోదం



ప్రజాశక్తి-డోన్

ఆప్కాస్‌లో పని చేస్తూ చనిపోయిన ఆరుగురు కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలలో భాగంగా ఉద్యోగం ఇవ్వాలని డోన్ మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. శుక్రవారం డోన్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆరు అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందులో ముఖ్యంగా మొదటి అంశం ఆప్కాస్ లో పనిచేస్తూ చనిపోయిన ఆరుగురు కార్మికుల పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలని, రెండవ అంశం రోటరీ క్లబ్ ఉన్న వీధిని రోటరీ క్లబ్ మార్గ్‌గా నామకరణం చేయాలని, మూడో అంశం ఆర్‌టిసి బస్టాండ్ వెనకాల 50 సెంట్లు స్థలాన్ని టెన్నిస్ కోర్టుకు కేటాయించాలని తీర్మానించారు. నాలుగో అంశంగా నూతన మున్సిపల్ కార్యాలయానికి నిధులు కేటాయించిన ఆర్థిక శాఖ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదించింది. మరో రెండు అంశాలకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నాయకత్వం వహించిన మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్‌ను కౌన్సిల్ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు కొట్రికె హరికిషన్ ,ఎస్ఎండి జాకీర్ హుస్సేన్, కో ఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్ రఫి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ డిఇ రసూల్, ఎఇ సురేష్ , టిపిఒ నాగరాజు, శానిటేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసమే జగనన్న సురక్ష : ఎమ్మెల్యే



లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : పథకాలు ఇంకా అందని పేదల కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషాలు పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణం మున్సిపాలిటీ పరిధిలోని 7,8, 10,12 వార్డుల లో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా పాల్గొని వార్డు ప్రజల నుండి వచ్చిన సమస్యలను తెలుసుకొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి సర్టిఫికెట్స్‌ను ప్రజలకు అందజేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ మా బున్నీసా, మున్సిపల్ కమిషనర్ రవీంద్రారెడ్డి, కౌన్సిలర్స్ మజీద్, శ్యామ్సుందర్ లాల్,కలాం బాషా,తౌహీద్, కోఆప్షన్ సభ్యులు సలాంముల్లా, 12వ ఇంచార్జ్ గోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కత్తి శంకర్,నిజాం ముద్దీన్, మార్కెట్ కలాం మాజీ కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, అనిల్ అమృతరాజ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు : అర్జీదారులకు మెరుగైన సేవలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశం అని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. సచివాలయము -1 లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం కార్యక్రమంలో అర్హులకు ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ రాజేంద్ర సింగ్,ఏవో మోహన్ కుమార్,పంచాయతీ కార్యదర్శి బాలు నాయక్, స్థానిక వైసిపి నాయకులు ఎం.ఏ.రజాక్, భరత్ రెడ్డి, గుండయ్య యాదవ్,రఫీ,తేజ, మమ్మద్ ఖాసిం, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం : సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన మండలంలోని యర్రగుడిదిన్నె గ్రామంలో ఎంపీడీవో మధుసూదనరెడ్డి తహాశీల్దార్ రవీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష అన్నారు. అనంతరం 11 రకాల సర్వీసులకు సంబంధించిన 235 ధ్రువపత్రాలను ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న కేశాలు, డిఎల్డిపిఓ జనార్దన్ ఉప సర్పంచ్ సుదర్శన్ రెడ్డి సొసైటీ మెంబర్ పుల్లారెడ్డి సోమశేఖర్ రెడ్డి, ఎర్రం నర్సిరెడ్డి, కో ఆప్షన్ నెంబర్ మదార్ సాహెబ్, నరసాపురం ప్రసాద్ రెడ్డి, జే సి ఎస్ మండల కన్వీనర్ పాణ్యం నాగేశ్, మండల మాజీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు లభించాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో తరువాయి 6లో...



పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న భూమా

భూమా అనుచరుడి మృతికి సంతాపం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని పాత బస్టాండు వీధికి చెందిన ముల్లా అక్బర్‌సా గారి మహబూబ్ బాష (66) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆళ్ళగడ్డ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ భూమా కిషోర్ రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకొని మహబూబ్ బాషా మృత దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబీకులకు తమ ప్రగాడ సానుభూతి వ్యక్తం చేసారు. సంతాపం తెలిపిన వారిలో అమీర్, గౌస్, మాలి,మహమ్మద్ గౌస్,హుసేన్‌భాష,అబ్దుల్ గౌస్,తదితరులు ఉన్నారు.



బాలికల వసతి గృహానికి ప్రహరీ గోడ నిర్మించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలో ఉన్నటువంటి ఎస్సీ బాలికల వసతి గృహానికి ప్రహరీ గోడ లేక విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని వెంటనే ప్రహరి గోడ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత విద్యార్థి ఫెడరేషన్ నాయకులు ఎస్సీ బాలికల హాస్టల్ ను శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డక్క కుమార్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్న మరమ్మతులు నోచుకోకుండా ఎస్సీ బాలికల వసతి గృహం ఉందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్లో మరమ్మతులు చేయాలని, అదేవిధంగా ఖాళీగా ఉన్న వార్డెన్, వర్కర్స్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్ నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభి ,రవి తదతరులు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీలో ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బత్తలూరు గ్రామపంచాయతీ మజీరా గ్రామమైన నందిపల్లెలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, 26 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. చింతకుంట సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాలను త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజలు అభివృద్ధిని గమనించి ఓటేయాలని ఎమ్మెల్యే గంగుల కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా

అసభ్య వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూరు

టిడిపి జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ బాబులపై వైసీపీ నేతలు అసభ్య వ్యాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెపుతామని టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా అన్నారు. శుక్రవారం నాడు స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రంజాన్ తోఫా, పెళ్లి కానుక, తదితర పథకాలతో ముస్లిం మైనార్టీలు అనేక విధాలుగా అభివృద్ధి చెందారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో గత ప్రభుత్వ పథకాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. నంద్యాల జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో నేడు ముస్లిం మైనార్టీలు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడుతున్నారని, నారా హమారా టిడిపి ఘర్ ఘర్ మే హై అనే నినాదంతో మైనార్టీలు పనిచేస్తున్నారని అన్నారు. ఖాదర్ బాషా టిడిపి అగ్ర నాయకుల పట్ల విమర్శించేందుకు మసీదులను అడ్డాగా చేసుకోవడం సరికాదన్నారు. సమావేశంలో అబ్దుల్లాపురం భాష నాగుర్ ఖాన్ తదితరులు ఉన్నారు.

త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయండి

- హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు

ప్రజాశక్తి - కొత్తపల్లి

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మించుకుంటున్న ప్రజలకు సంబంధిత అధికారులు ఇంటి నిర్మాణ పనుల విషయంలో త్వర త్వరగా పూర్తిచేసుకునే ందుకు సహకరించాలన్నారు. జూలై 15 లోపు ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలని ఇంకా నిర్మాణంలో ఉన్న వాటిని పది రోజులలోపు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన అధికారుల సమావేశంలో పాల్గొని గ్రామాల్లో జరుగుతున్న జగనన్న ఇంటి నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మేరీ హౌసింగ్ అధికారులు మురళి, పంచాయతీరాజ్ ఏఈ రామచంద్రయ్య, హౌసింగ్ సిబ్బంది రామకృష్ణ ఉన్నారు.



జగనన్న కాలనీలో నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ

ఘనంగా శ్రీ చౌడేశ్వరి దేవి 'చీర- సారె' మహోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ కాశీ విశాలాక్ష్మి స్వరూపమైన శ్రీ నందవరం చౌడేశ్వరి దేవి చీర–సారె మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతిఏటా ఆషాడ బహుళ చవితి రోజున అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చీర–సారె సమర్పణ నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం నుండి ఉదయం10.30 గంటలకు పెద్దఎత్తున మహిళలు చీరె సారేతో భక్తుల సందడితో కోలాటాల మధ్య, మంగళ వాయిద్య నృత్య వేద ఘోషల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగింపుగా బయలుదేరి ఒంటి గంటకు ఆలయానికి చేరుకుని "అమ్మవారికి చీరె సారె" సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. నందవరం చౌడేశ్వరి మాత చీర–సారె మహోత్సవంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిగా, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందవరం విచ్చేసి చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి కోలాటాల మధ్య ఊరేగింపుగా బయలుదేరిన చీర సారె సమర్పణ ఊరేగింపు ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నందవరం, బనగానపల్లె,నంద్యాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన మహిళలు తమ ఇళ్ల నుండి అమ్మవారికి చీర సారె తీసుకవచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణా ధికారి రామానుజన్, మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మహెూత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని , జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా : సిఐటియు

ప్రజాశక్తి - వెలుగోడు

గ్రామ పంచాయతీలలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది స్వీపర్సు ఎలక్ట్రీషన్ వాటర్ వర్క్స్ చెత్త బండి డ్రైవర్స్ గ్రామాలలోని చెత్తను ఎత్తివేస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ ప్రజలకు అంటురోగాలు రాకుండా సేవలు చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది ఈ ప్రభుత్వానికి గుర్తుకు రాదా అని సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్షులు వి.యేసు రత్నం, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, సిఐటియు వెలుగోడు మండల కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామపంచాయతీ వర్కర్స్ నాయకులు జాన్ శికామణి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 551 ప్రకారం టెండర్ విధానం రద్దు చేయాలన్నారు. 2015 నుండి పనిచేస్తున్న వర్కర్స్‌ను టెండర్ విధానం నుండి తొలగించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయడం లేదన్నారు. గ్రామపంచాయతీ వర్కర్స్ కు టైం స్కేలు అమలు చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులను సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

అంగన్వాడీ సెంటర్లలో నాణ్యమైన ఆహారం అందించాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ.. ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పించండి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి సూచించారు. శుక్రవారం నాడు డోన్ నియోజకవర్గం లో ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటనలో భాగంగా బేతంచర్ల మండలంలోని సిమెంట్ నగర్ గ్రామంలో 2,4 అంగన్వాడి కేంద్రాలు, బేతంచెర్ల పట్టణంలో 5, 7,19 అంగన్వాడి కేంద్రాలను, సాయి ధరణి కాలనీలోని జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో ఆహారాన్ని స్టోర్ రూమ్, వంటగదిని పర్యవేక్షించి పరిశీలించారు. 14వ వార్డులోని ప్రజలతో కలుసుకొని చౌక ధరల దుకాణంలో సరైన సమయానికి అందిస్తున్న సరుకులు అందుతున్నాయా అన్నారు. ఐసిడిఎస్ అధికారి పిడి నిర్మలతో అంగన్వాడి సెంటర్లకు నాణ్యమైన ఆహారం సరఫరా ఏ విధంగా ఉన్నత అధికారులకు తెలియజేసి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ జగన్, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ అధికారి జిలాని బాష, ఫుడ్ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్, సి ఎస్ డి టి ప్రసాద్ రావు, ఐసిడిఎస్ పిడి నిర్మల, బేతంచెర్ల మండలం తాసిల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, ఎంఈఓ సోమశేఖర్,సిడిపిఓ శంషాద్ బేగం , సూపర్వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడి సెంటర్లను వడ్డేపేటలోని ప్రజలతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషనర్ ప్రతాపరెడ్డి

విజయవంతం చేయాలి : రాయలసీమ స్టీరింగ్ కమిటీ

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

రాయలసీమకు రావాల్సిన నీళ్ళు,నిధులు,నియామకాలలో సమాన వాటా కోసం రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్,మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంను విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం.వి. రమణారెడ్డి,మండల నాయకులు గొల్ల చిన్న నారాయణలు కోరారు. శుక్రవారం బండి ఆత్మకూరులోని శ్రీ లక్ష్మి జనార్ధనస్వామి ఆలయ ప్రాంగణంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పర్ భద్ర ప్రాజెక్టు, తదితర అంశాలపై వివరించారు. చలో ఢిల్లీ కార్యక్రమమును విజయవంతం చేసి రాయలసీమ గళాన్ని కేంద్ర ప్రభుత్వంకు వినిపించేందుకు తిరుపతి,కడప,గుత్తి,కర్నూలు ప్రాంతాల మీదుగా ఢిల్లీ వెళ్లేందుకు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయడం జరిగిన్నారు. ఈ సమావేశంలో బైరెడ్డి లక్ష్మి రెడ్డి,సుధాకర్ రెడ్డి, కావేటి నారాయణ,చెదుల్ల చంద్రశేఖర్ రెడ్డి,సీమ రామిరెడ్డి, ఇటుకల శ్రీనివాస్ రెడ్డి, మారసు నారాయణ,ఇ. ఓబుళరెడ్డి,కె.ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చలో ఢిల్లీ కరపత్రాలు విడుదల చేస్తున్న సాగునీటి సాధన కమిటీ సభ్యులు

భూమా కిషోర్ రెడ్డివి నిరాధార ఆరోపణలు : వైసిపి

ప్రజాశక్తి-ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ తాలూకా బిజెపి బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడాలని వైకాపా నాయకులు, ఉయ్యాలవాడ మండల అధ్యక్షులు బుడ్డా చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్ర రెడ్డి కార్యాలయంలో ఆయన హరివరం గ్రామానికి చెందిన వైకాపా నాయకులతో కలిసి మాట్లాడారు. హరివరం గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో గ్రామానికి చెందిన బోల్లపు లక్ష్మీదేవి, శీలార్ బిలు మరణిస్తే, గ్రామ నాయకుల అభ్యర్ధన మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మరణించిన వారి పేర్లను ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి బోల్లపు లక్ష్మీదేవికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కు మంజూరు చేయడం జరిగిందని, బాధిత కుటుంబానికి సమాచారం అందించిన వారు స్పందిం చలేదన్నారు. మరణించింది ఇద్దరైతే ఒకరికే చెక్కు రావడంతో తాము ఇరువురికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే గంగుల దృష్టికి తీసుకెళ్లి ఇద్దరికీ చెక్కులు వచ్చేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని చెప్పడం జరిగిందన్నారు. బాధితుల్లో ఒకరు బీజేపీకి చెందిన వారైనప్పటికీ తాము అందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే పంపడం జరిగిం దన్నారు. ఈ విషయాలన్నీ పూర్తిగా తెలుసుకోకుండా కమిషన్ల కోసమే వైకాపా నాయకులు చెక్కులు ఇవ్వలేదని బాధితులు తనతో చెప్పారని భూమ కిషోర్ రెడ్డి ఆరోపణ చేయడం జరిగిందన్నారు. తాము మామూల్లు అడిగామని భూమా కిషోర్ రెడ్డి నిరూపించాలని, బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని వారు అన్నారు. ఈ సమావేశంలో హరివరం గ్రామ వైకాపా నాయకులు పల్లె మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, తరిగోపుల ప్రసాద్ రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, ఇంజేటి శ్రీనివాసరెడ్డి, బోయిన శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైకాపా నాయకులు

ఘనంగా ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 29వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు వేణుగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

స్థానిక గాంధీ సెంటరులో జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని వారు డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో ఎంఈఎఫ్ తాలుకా ప్రధాన కార్యదర్శి ఘన మద్దిలేటి,మండల అధ్యక్షుడు అంజయ్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు సంజీవరాయుడు, లక్ష్మినారాయణ, గడ్డికిషోర్, ప్రకాష్,పాములేటిరాజు,శివ,రంగడు,శ్రీను,జగన్,ఓబులేసు,పెంచలయ్య,రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహానంది : మండలంలోని గాజులపల్లె గ్రామంలో జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహ, వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ మాదిగల అభ్యున్నతి కోసం ఎంఆర్‌పిఎస్ కృషి చేస్తోందన్నారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జయనరసింహ, రవి నరసింహ సర్వయ్య, సర్వన్న, శ్రీను,పి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

మతాలకు అతీతంగా పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

ముఖ్యమంత్రి జగన్ కుల,మత,పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొన్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చాగలమర్రి పట్టణంలోని 4,5 సచివాలయాల పరధిలో ఎంపిపి వీరభద్రుడు,వైసీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి లతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బుక్ లెట్ అందజేసి అందిన పథకాలను వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపసర్పంచ్ సోహెల్, వైస్ ఎంపిపి రఫి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, వైసీపీ నాయకులు గేట్లమాబు,ఎంపీటీసీ ఫయా జ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని పరామర్శించిన ఎఐఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

హాస్టల్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురై నంద్యాలలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీప్రసన్నను ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, ఉదయ్ మాట్లాడుతూ గోస్పాడు మండలంలోని గత రెండు వారాల కిందట కేజీబీవీ హాస్టల్లో ఏడవ తరగతి చదువుతున్నటువంటి జిల్లెల్ల గ్రామానికి చెందిన లక్ష్మీ ప్రసన్న అనే విద్యార్థికి నిద్రిస్తున్నటువంటి సమయంలో పాముకాటుకు గురైనప్పటికీ ఆ అమ్మాయి పాము కాటికి గురి అయిన తెలుసుకోలేని పరిస్థితిలో కేజీబీవీ హాస్టల్ ఎస్ఓ ఉన్నారని మండిపడ్డారు. వారిని విధుల నుంచి తొలగించి, విద్యార్థి చికిత్సకు అధికారులే వైద్య ఖర్చులను భరాయించాలని వారు డిమాండ్ చేశారు.

మెనూ పాటించండి : ఎంఇఒ

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న బోజనం అందించే ఏజెన్సీ వారు మెనూ తప్పక పాటించాలని ఎంఈఓ నయాంతుల్ల తెలియజేసారు. మండలం లోని ముత్యాలపాడు గ్రామంలో గల ఎస్‌పీజి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న బోజన పథకాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేసి భోజనాన్ని రుచి చూసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన బోజనాన్ని అందించాలని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ పాటించాలని సూచించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రియదర్శిని,సిఆర్‌పి అమీర్‌ఖాన్‌లు పాల్గొన్నారు.

వైసిపిని ఇంటికి పంపేందుకు సిద్ధం

ప్రజాశక్తి - నందికొట్కూరు

పరిపాలన చేతకాని వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు గంటే పోగు జయాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. ప్రజల్లో వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతకు సీఎం జగన్మోహన్ రెడ్డి భయాందోళనకు గురై ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని ఢిల్లీ పెద్దలను వేడుకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందని అన్నారు.

లింగాపురంలో లేగ దూడల ప్రదర్శన

బండి ఆత్మకూరు : పాడి రైతులు లేగదూడలను పెంచడం ద్వారా అధిక లాభాలు అర్జించవచ్చని జిల్లా పశు ఘణాభివృద్ధి సంఘం ఉప సంచాలకులు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని లింగాపురం గ్రామంలో పశు సంవర్ధకశాఖ,పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు పశువుల పెంపకంలో పశు వైద్యాధికారులు,సిబ్బంది సలహాలు,సూచనల మేరకు పశువులకు,దూడలకు వ్యాక్సిన్‌లను తగు మోతాదులో వేయాలన్నారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. వెలుగోడు సహాయ సంచాలకులు ధనుంజయుడు,పశు వైద్యులు రాజశేఖర్, అనూష,గౌసియా బేగం, సిబ్బంది లక్ష్మీనారాయణ,సునీల్ కుమార్, గోపాలమిత్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.



9న బిసిల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - నందికొట్కూరు

బీసీల సమస్యలపై తొమ్మిదో తేదీన విజయవాడలో జరుగు రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ నందికొట్కూర్ అసెంబ్లీ ఇన్చార్జి ఎల్ స్వాములు కోరారు. శుక్రవారం నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం తరిగోపుల గ్రామంలో రౌండ్ టేబుల్ సమావేశ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. ఈ సమావేశంలో చిన్న వెంకటస్వామి, ప్రసన్న, రత్నమయ్య, విజయవర్మ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన యువతకు వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో మీరాపురం యూత్‌కు కాటసాని ఓబుల్ రెడ్డి కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, మీరాపురం వైసీపీ నాయకుడు బత్తుల రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడి నాయకురాలు

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10, 11 తేదీల్లో కలెక్టర్ ఆఫీస్ ముందు నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి కోరారు. శుక్రవారం వారు 36 గంటల పాటు కలెక్టర్ ఆఫీస్ ముందు అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ సభ్యులందరూ పాల్గొంటారని పర్మిషన్ ఇవ్వాలని కోరుతూ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మదార్ బీ, సెక్టార్ లీడర్స్ అనురాధ, భాగ్యలక్ష్మిలు నందికొట్కూరు ఐసిడిఎస్ అధికారికి, సిడిపిఓ అధికారిలకు వినతి పత్రాలు ఇచ్చారు.



బురద నీటిని చూపిస్తున్న నాయకులు

పాఠశాలకు సిసి రోడ్డు నిర్మించాలి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని ఎర్రమఠం గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశా లకు అంగన్వాడీ కేంద్రానికి వెళ్లాలంటే బురద ఉండడంవల్ల పాఠశాల విద్యార్థులు అంగన్వాడి పిల్లలు గర్భిణులు, బాలింతలు అనేక ఇబ్బందులకు గురవుతు బురదలో వెళ్తున్నారని పాఠశాల వరకు సిసి రోడ్డు నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని ఎర్రమఠం పాఠశాల ముందున్న రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రమఠం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలోని అంగన్వాడీ సెంటర్‌కు విద్యను అభ్యసించేందుకు 105 మంది విద్యార్థులతో పాటు అంగన్వాడీ పిల్లలు, గర్భిణులు, బాలింతలు బురద నీటిలో వస్తున్నారని అన్నారు. వర్షా కాలం వచ్చిందంటే నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి గాని పాలకులకు గాని విద్యార్థుల సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థులకు సిసి రోడ్డును మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.



ఆర్‌టిఐ కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

మహానంది క్షేత్రంలో ఆర్‌టిఐ కమిషనర్

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్య క్షేత్రంలో శుక్రవారం నాడు ఆర్టిఐ కమిషనర్ శ్రీనివాసులు పూజలు నిర్వహించారు. ముందుగా వీరికి ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, తహశీల్దారు జనార్దన్ శెట్టిలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి పూజా కార్యక్రమాలు చేయించారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రం,చిత్రపటం ఇచ్చి సత్కరించారు. ఆలయ అధికారులు, వేదపండితులు, రెవెన్యూ సిబ్బంది,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నగదు అపహరణ కేసులో ముద్దాయిల అరెస్ట్

ప్రజాశక్తి - నందికొట్కూరు

జూపాడు బంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని, జూపాడుబంగ్లా గ్రామం మండలంలోని ప్రభుత్వ వైన్ షాప్‌లో మే 10వ తేదీన నగదు అపహరణ చేసిన దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. 3,07,340 రూపాయలను దొంగలించుకొని పోయినారని సదరు వైన్ షాప్ సుపర్వైజర్ తెలుగు పరమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. సమాచారం మేరకు నందికొట్కూరు రూరల్ సిఐ జీ .సుధాకర్ రెడ్డి జూపాడుబంగ్లా గ్రామ శివారులోని కేజీ రోడ్డులో ఉన్న కేసీ కెనాల్ దగ్గర సిబ్బందితో పాటు వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానిత వ్యక్తులు ఒక స్కూటి మీద వస్తుండగా వారిద్దరినిపై కేసులో ముద్దాయిలుగా గుర్తించి ముద్దాయిలను అరెస్టు చేశారు. అనంతరం ముద్దాయిలను రిమాండ్‌కు తరలించిన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



శ్రీశైలం ప్రాజెక్టు : లబ్దిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

పేదల కోసమే జగనన్న సురక్ష : ఎమ్మెల్యే

5వ పేజీ తరువాయి..

ఎంపీడీవో శివరామయ్య అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మంజుల వాణి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు. 801 మందికి ధృవీకరణ పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే, జడ్పి చైర్మన్ మాట్లాడారు. తిమ్మాపురం గ్రామంలో ఇప్పటివరకు 3 కోట్ల 50 లక్షల రూపాయల అభివృద్ధి పనులు చేయడం జరిగిందని తెలిపారు. వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మంగవరపు లక్ష్మీదేవి, తిమ్మాపురం గ్రామ సర్పంచ్ ఆల్లె సుప్రజ, వైసిపి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జిల్లెల్ల శివరామిరెడ్డి, వైసిపి నాయకులు అల్లే సురేష్ రెడ్డి,జిల్లెళ్ల శంకర్ రెడ్డి, వెంకటరెడ్డి, బాల తిమ్మయ్యా, బాల వెంకట, భాస్కర్ రెడ్డి ,అవ్వ పుల్లారెడ్డి, సుబ్బరామయ్య, సుబ్బరాయుడు, షేక్ మహబూబ్ సుభాన్, బాల వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.



రుద్రవరం : ప్రజలకు అభివాదం తెలుపుతున్న ఎమ్మెల్యే గంగుల